## క్లుప్తంగా

### రేపటి నుంచి శ్రీ సిద్ధేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట



నూతనంగా నిర్మించిన సిద్దేశ్వర స్వామి ఆలయం

**వల్లూరు:** వల్లూరు మండల పరిధిలోని పెద్ద లేబాక, బక్కిరెడ్డి పల్లె గ్రామాల మధ్యన నూతనంగా నిర్మించిన శ్రీ సిద్దేశ్వర స్వామి ఆలయంలో ఫిబ్రవరి 1 వ తేదీ నుండి మూడు రోజుల పాటు విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. వేద పండితుల ఆధ్వర్యంలో శ్రీ సిద్దేశ్వర స్వామి, గణపతి, పార్వతీ మాత, సుబ్రమణ్య స్వామి, నందీశ్వరుడు, నాగులు విగ్రహ, ధ్వజ ప్రతిష్టా కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా 3 న యంత్ర ప్రతిష్ట, ప్రధాన హోమాలు, విగ్రహ ప్రాణ ప్రతిష్ట, జ్వాలా దర్శనం, మహా పూర్ణాహుతి, కుంభాభిషేకం కార్యక్రమాలు జరుగుతాయి, అనంతరం స్వామి వారి కళ్యాణోత్సవం జరుగుతుంది. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరుగుతుంది.

### ఖబరస్థాన్‌కు స్థలం కేటాయించాలని వినతి

**ఎర్రగుంట్ల :** ఎర్రగుంట్ల నగర పంచాయతీ పరిధిలోని రాణీవనంలో 20వ వార్డులో నివాసం ఉంటున్న ముస్లిం, నూర్‌బాషా సోదరులకు కావాల్సిన ఖబరస్థాన్‌కు రెండు ఎకరాల భూమిని కేటాయించాలని కోరుతూ సోమవారం మైనార్టీలందరూ కలసి తహసీల్దార్ నాగేశ్వర రావుకు వినతి పత్రం అందించారు. ఖబరస్థాన్‌కు స్థలం కేటాయించాలని పలుమార్లు విన్నవించినట్లు వారు పేర్కొన్నారు. ఇప్పటికైన అధికారులు చర్యలు తీసుకుని స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మహమ్మద్ అలి, మాజీ కో-ఆప్షన్ సభ్యులు బిక్కుసాహెబ్, మైనార్టీ నాయకుడు జిగ్లీబాష, హసంలు పాల్గొన్నారు.

### వృద్ధులకు అన్నదానం



వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

**సింహాద్రిపురం :** మండల పరిధిలోని దిద్దేకుంట్ల గ్రామంలో సోమవారం ఉదయం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి రవిశేఖర్ సతీమణి దివంగత దిద్దేకుంట కృష్ణమ్మ వర్ధంతిని పురస్కరించుకుని ఆమె సమాధి వద్ద కుమారుడు రామలింగేశ్వర, కుమార్తె హేమలత, అల్లుడు గంగాధర్‌లతోపాటు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ డి.రుక్మిణమ్మ, హరిప్రసాద్, కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు.

**వేంపల్లె :** వేంపల్లె పాత గండిరోడ్డులో ఉన్న మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో సోమవారం దివంగత దిద్దేకుంట కృష్ణమ్మ వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు మదన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

**లింగాల :** మండల పరిధిలోని ఇప్పట్ల గ్రామ సమీపంలో ఉన్న లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

### రైతులు ఫిర్యాదు చేయాలి

**ముద్దనూరు:** మండలంలో వ్యవసాయ ట్రాన్‌ఫారంలు పొందడానికి ఎవరికీ ఎటువంటి లంచం ఇవ్వరాదని, ఎవరైనా డబ్బులు అడిగితే తనకు ఫిర్యాదు చేయాలని విద్యుత్ ఏఈ వర్మ సోమవారం తెలిపారు. సాక్షి దినపత్రికలో ట్రాన్స్‌ఫారం మంజూరులో చేతివాటం అనే శీర్షికతో వార్తా కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఏఈ సిబ్బందితో సమీక్షించారు. ట్రాన్స్‌ఫారంతో పాటు ఎటువంటి విద్యుత్ సమస్యలున్నా తన దృష్టికి తేవాలని, రైతులు ట్రాన్స్‌ఫారం కోసం ప్రత్యక్షంగా తననే సంప్రదించాలని ఏఈ కోరారు.

### రేపటి నుండి రథయాత్ర ప్రారంభం

**చక్రాయపేట:** మహాశివరాత్రి పర్వదినం నేపథ్యంలో బుధవారం నుండి మండల వ్యాప్తంగా శ్రీదేవి భూదేవి శ్రీవేంకటేశ్వర, శివపార్వతుల ఉత్సవ విగ్రహాల రథయాత్ర ప్రారంభిస్తున్నట్లు ఆలయ చైర్మన్ ఓబుళరెడ్డి తెలిపారు. మండల వాసులందరినీ ఉత్సవాల్లో భాగస్వాములను చేసే నిమిత్తం అందిరినీ ఆహ్వానించేందుకు రథయాత్రను ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు.

ప్రచార రథం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా బ్రహ్మంగారిమఠం మండలం తోటపల్లి అచలానందాశ్రమ పీఠాధిపతి స్వామి విరజానంద వస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్‌లు మోపూరి రామాంజనేయరెడ్డి, చక్రపాణిరెడ్డి, హరనాథరెడ్డి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# హంస వాహనంపై వెంకటరమణుడు

**పులివెందుల టౌన్ :** పట్టణం నడిబొడ్డున వెలసిన పద్మావతి సమేత కళ్యాణ శ్రీవేంకటరమణస్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం మూడవ రోజు స్వామివారు ఉదయం చిన్న శేష వాహనంపై, సాయంత్రం హంస వాహనంపై పులివెందుల పుర వీధులలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవ దేవుని దివ్య మంగళ స్వరూపాన్ని చూసి భక్తులు తరించారు. స్వామి గ్రామోత్సవం గోవిందనామ జపాలతో కొనసాగింది.

**ప్రత్యేక పూజలు :**

బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం శ్రీ వేంకటరమణుడి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్తనామార్చన, నివేదన, ప్రధాన నిత్య హోమాలు, కలశారాధన చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు ఉభయదారులు విరూపాక్షి నారాయణప్ప కుటుంబ సభ్యులు, ఆలూరు భాస్కర్ల దంపతులతో విశేష పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. స్వామిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. గ్రామోత్సవానికి ముందు ఆలయ ప్రాంగణంలో సహస్త దీపాలు వెలిగించి ఊంజల్ సేవను వైభవంగా నిర్వహించారు. ఆలయప్రాంగణాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు.

**నేటి అలంకారం :**

వేంకట రమణుడి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామివారు ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపు పందిరి వాహనంపై పురవీధులలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆలయంలో విశేష పూజలతోపాటు సాయంత్రం ఊంజల్ సేవను కన్నుల పండువగా నిర్వహించనున్నారు.



చిన్న శేషవాహనంపై శ్రీవేంకటరమణుడు



హంస వాహనంపై శ్రీవారు

### వైభవంగా గ్రామోత్సవం

**వీరపునాయునిపల్లె:** మండలంలోని కీర్తిపల్లె గ్రామంలోని నల్లనమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవాలలో భాగంగా సోమవారం అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా సాగింది. ఆలయ ప్రధాన అర్చకుడు ఉమామహేశ్వర శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కుంకుమార్చన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు భక్తి శ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా నిర్వహించిన హోమ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు, అగ్నిగుండం ప్రవేశ కార్యక్రమంలో యువకులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ఆలయ చైర్మన్ విజయ్‌కుమార్‌రెడ్డి దంపతులు కీర్తిపల్లె ఆడబిడ్డలకు పసుపు, కుంకుమ, చీర అందజేశారు.

**నేడు బండలాగుడు పోటీలు**

వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం 8 గంటలకు ఒంగోలు జాతికి చెందిన న్యూ కేటగిరి వృషభ రాజములచే బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆల య ధర్మకర్త విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాలను ప్రారంభించేందుకు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నట్లు ఆయన తెలియజేశారు.

### వైఎస్ఆర్‌కు ఘన నివాళి



**చక్రాయపేట:** రైతు బాంధవుడు దివంగత మహానేత వైఎస్ ప్రత్యేక చొరవతో రూపుదిద్దుకున్న వెలిగల్లు రిజర్వాయర్ కారణంగా నేడు గాలివీడు మండల రైతన్నలు పంటలు పండించుకొంటున్నారని రాష్ట్ర రెడ్డి సంఘం అధ్యక్షులు కసిరెడ్డి శివారెడ్డి పేర్కొన్నారు. ఇందుకు కృతజ్ఞత పూర్వకంగా తాము వెలిగల్లు రిజర్వాయర్ వద్ద మహానేత విగ్రహానికి పూలమాల వేసి ఇడుపుల పాయలోని వైఎస్ఆర్ ఘాట్ వద్దకు వైఎస్ఆర్ రైతు సుభిక్ష యాత్ర పేరుతో పాదయాత్రగా వచ్చి నివాళులు అర్పించామని చెప్పారు. సర్పంచులు ఉమాపతి రెడ్డి, వెంక టాద్రి, వైఎస్ఆర్ సీపీ నేతలు శివగంగిరెడ్డి, జావీద్, నిజాం, గణేష్ , పూల మధు సూదన్, కొసినేపల్లి వెంకట రామిరెడ్డి, రంగం రెడ్డి మల్లికార్జునతో పాటు సుమారు యాభైమందికి పైగా యువకులు అభిమానులు పాల్గొన్నారు. పాదయాత్ర చేస్తూ వస్తున్న వారికి చక్రాయపేటలో వైఎస్ఆర్‌సీపీ కి చెందిన పలువురు సంఘీభావం తెలిపారు.

### యూరియా కొరత లేదు

**కమలాపురం:** కమలాపురం వ్యవసాయ డివిజన్ పరిధిలో యూరియా కొరత లేదని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం కమలాపురం మండలంలోని ఎరువుల దుకాణాలను ఏఓ సరస్వతితో కలసి ఆయన తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్, దుకాణాల్లో ఉన్న ఎరువుల నిల్వను తనిఖీ చేశారు. దుకాణదారులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. మండలంలో 90 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. అలాగే ఆర్‌బీకేల్లో 8 మెట్రిక్ టన్నుల యూరియాతో పాటు అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు.

# పరిశ్రమలతో జీవన ప్రమాణాలు పెంచుకోవచ్చు

**– పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి**



సమావేశానికి హాజరైన రైతులు, మెప్మా మహిళలు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

**పులివెందుల రూరల్ :** చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని జీవన ప్రమాణాలు పెంపొందించుకోవచ్చునని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని చిన్నరంగాపురం గ్రామ సమీపంలో ఉన్న ఫుడ్‌అండ్‌సైన్స్ కళాశాలలో కళాశాల డీన్ ఆధ్వర్యంలో ఫుడ్ ప్రాసెసింగ్‌పై రైతులకు, మెప్మా మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ జీవన ప్రమాణాలను పెంచుకునేందుకు వివిధ రకాల పదార్థాలను తయారు చేసుకుని ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసే విధంగా మార్కెట్ వసతులు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. చిన్న, చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడంవల్ల మహిళలు అన్ని విధాలా ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చునన్నారు. బ్యాంకులు కూడా విరివిగా రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. మహిళలు, రైతులు వివిధ రకాల వ్యాపారాలు చేసుకునేందుకు ఆసక్తి గల వారు పాల్గొని అధికారులు చెప్పే సూచనలు, సలహాలు పాటించాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల సహకారంతో పులివెందుల నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. గండికోట ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గంలోని చక్రాయపేట మండలానికి నీరు ఇవ్వడం జరుగుతోందన్నారు. చిత్రావతి, పైడిపాలెం ప్రాజెక్టులలో 16టీఎంసీల నీరు ఉందన్నారు. చీనీ, అరటి పంటలకు మంచి దిగుబడి రావడానికి అన్ని వసతులు మన ప్రాంతాలలో ఉన్నాయన్నారు. రైతులకు కావాల్సిన అన్ని మౌళిక సదుపాయాలను కల్పించే విధంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు.

### నిర్ణయించిన ధరలకే ఎరువులను విక్రయించాలి

**వేంపల్లె :** ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను విక్రయించాలని మండల వ్యవసాయాధికారి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎరువుల దుకాణదారుల గోడౌన్లలో ఎరువుల నిల్వలపై ఆయన తనిఖీలు చేపట్టారు. అనంతరం ఆయన ఎరువుల దుకాణాలలో అమ్మకాలు, కొనుగోలు, రసీదులు, డైలీ స్టాక్ బోర్డు తదితర రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆర్‌బీకే, ప్రైవేట్ దుకాణాలలో రైతులకు 175 మెట్రిక్ టన్నుల యూరియ అందుబాటులో ఉందన్నారు. అధిక ధరలకు అమ్మినట్లు రైతులు ఫిర్యాదులు చేస్తే దుకాణదారుల లైసెన్స్ రద్దు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, దుకాణదారులు పాల్గొన్నారు.

### ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వైఎస్ఆర్

**వేంపల్లె :** ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజల గుండెల్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిరస్థాయిగా నిలిచారని పీసీసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ పేర్కొన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన మీడియా చైర్మన్ డాక్టర్ ఎస్.తులసిరెడ్డి, యువజన విభాగపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుమలేష్, కడప జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసులు, కదిరి ఇన్‌ఛార్జి శ్రీహరిలతో కలిసి ఆయన హాథ్ సే హాథ్.. జోడో అభియాన్ కార్యక్రమ గోడ పత్రాలు, కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు ధ్రువకుమార్‌రెడ్డి, సుబ్రమణ్యం, శర్మ, రామకృష్ణ, చెన్నకేశవ, నరసింహారెడ్డి, ఉత్తన్న, వెంకటేష్, బద్రీ, రామయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

# కుష్టు వ్యాధి నిర్మూలనకు తోడ్పడండి



లింగాల : లెప్రసీపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది



సంతకొవ్వూరులో కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

**సింహాద్రిపురం :** కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తోడ్పడాలని మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన సింహాద్రిపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ కుమార్, డాక్టర్ హుస్సేన్‌ల ఆధ్వర్యంలో జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కుష్టు వ్యాధి సోకిన వారిపట్ల ఎలాంటి వివక్ష ప్రదర్శించవద్దని.. ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేసి సమాజంలో కుష్టు వ్యాధి నివారణకు పాటుపడాలన్నారు. అలాగే గురిజాల పంచాయతీ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకుడు కరుణాకర్‌రెడ్డి, ఏఎన్ఎం రమాదేవి, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు కుష్టు వ్యాధి నిర్మూలనకు తోడ్పడతామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ కృష్ణమూర్తి, సూపర్‌వైజర్ జయప్రసాద్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

**పులివెందుల టౌన్ :** మున్సిపాలిటీ పరిధిలోని చిన్న రంగాపురం సచివాలయ పరిధిలో జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బ్రాహ్మణపల్లె, చిన్నరంగాపురం వార్డుల కౌన్సిలర్లు మహేశ్వరరెడ్డి, బండి శివలక్ష్మిదేవిలు హాజరై కుష్టు వ్యాధి గురించి, కుష్టు వ్యాధి నివారణ గురించి ప్రజలకు, గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీ శైలజ, టీచర్ అరుణ కుమారి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**లింగాల :** లింగాల మండలంలో సోమవారం గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని లెప్రసీ పక్షోత్సవాలను ప్రారంభించారు. పార్నపల్లె గ్రామంలో సర్పంచ్ బోనాల సుబ్బయ్య ఆధ్వర్యంలో డీపీఎంఓ పి.వి.రమణారెడ్డి ఆధ్వర్యంలో మహాత్మ గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వచ్చే 15రోజులపాటు అన్ని గ్రామాలలో లెప్రసీపై అవగాహన, లెప్రసీ లక్షణాలు, వాటి నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సర్పంచ్ సందేశాన్ని చదివి వినిపించి పక్షోత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**పెద్దముడియం:** గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం మేడిదిన్నె పిహెచ్‌సి పరిధిలోని అన్ని గ్రామ పంచాయితీలలో కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు పిహెచ్‌సి వైద్యుడు మహమ్మద్ హుస్సేన్ తెలిపారు. పెద్దపసుపుల గ్రామంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి అనుమానిత మచ్చలు గల వారిని గుర్తించి పిహెచ్‌సి వైద్యుడు పరీక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### రూ.5 లక్షల విరాళం



భూమి పూజలో విరాళం అందిస్తున్న దాత

**ముద్దనూరు:** మండలంలోని యామవరం గ్రామంలోని శ్రీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో నిర్మిస్తున్న కళ్యాణ మండపానికి అదే గ్రామానికి చెందిన గోకుల్ ట్రాన్స్‌పోర్టు యజమాని గుమ్మిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి రూ.5 లక్షల విరాళం అందజేశారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో కళ్యాణమండపం నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి నగదును విరాళంగా అందజేశారు.

### గండిలో ఆభరణాల మదింపు



ఆభరణాల మదింపు కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

**చక్రాయపేట :** గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో భక్తులు సమర్పించిన ఆభరణాల మదింపు కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి సోమవారం తెలిపారు. ఇప్పటి వరకు లాకర్లలో భద్రపరచి ఉన్న వాటిని కర్నూలు ఆభరణాల తనిఖీ అధికారి శ్రీనివాసరెడ్డి మదింపు చేశారని చెప్పారు. ఈ సందర్భంగా 1230 గ్రాముల బంగారు, 126 కిలోల 896 గ్రాముల వెండి ఉన్నట్లు చెప్పారు. ఇందులో స్వామి వారి అలంకరణకు పోను మిగిలిన ఆభరణాలను కరిగించి డిపాజిట్ చేయాలని అధికారులు ఆదేశించారని వివరించారు. కార్యక్రమంలో అప్రైజర్ మాధవస్వామి, సిబ్బంది, ఆలయ చైర్మన్ రాఘవేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# జాతిపితకు ఘన నివాళి



గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధరరెడ్డి, తదితరులు

**ముద్దనూరు:** జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం ఆయనకు ఘన నివాళులర్పించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో జాతిపిత చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రమేష్, శేఖర్, అంకాల్ రెడ్డి, సూర్యముని రెడ్డి, శ్రీనివాసులు, సుదర్శన్ రెడ్డి, దస్తగిరి, ప్రసాద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**వేంపల్లె :** గాంధీజీకి స్థానిక ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. సోమవారం వేంపల్లెలోని ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో ఏపీపీ నాయకులు రహమతుల్లా గాంధీజీ చిత్ర పటానికి పూలమాల వేసి రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు.

**పులివెందుల టౌన్/రూరల్ :** జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న గాంధీజీ విగ్రహానికి పలువురు నివాళి అర్పించారు. సోమవారం సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధరరెడ్డి, కౌన్సిలర్లు పార్నపల్లె కిశోర్, డేనియల్, సిద్ధయ్య, ఖాదర్ బాష, కొండ్రావు, రంగనాయకులుతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రమౌళి, లక్ష్మీనారాయణ, సంపత్, రాజేష్, షమీవుల్లా, కృష్ణమూర్తి తదితరులు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రవి, మాధవ్, లక్ష్మీనారాయణరెడ్డి, ఆవోపా రాష్ట్ర కన్వీనర్ మేడా సాయిబాబా పాల్గొన్నారు.

**మార్కెట్ యార్డు కార్యాలయంలో..**

స్థానిక మార్కెట్ యార్డు కార్యాలయంలో మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, డిప్యూటీ డైరెక్టర్ లావణ్యలు గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డిల సూచనలమేరకు త్వరలోనే పులివెందుల మార్కెట్ యార్డులో చీనీ కాయల కొనుగోలు చేసే కార్యక్రమం మొదలవుతుందని.. రైతులు, వ్యాపారస్తులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సర్వోత్తమ రెడ్డి, మార్కెట్ యార్డు సిబ్బంది పాల్గొన్నారు.

# శనగ పంట కోత ప్రయోగం

**వేంపల్లె :** వేంపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని నేషనల్ అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆధ్వర్యంలో శనగ పంట కోత ప్రయోగాలు నిర్వహించినట్లు వ్యవసాయాధికారి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. వేంపల్లెలోని శనగ పంట పొలాల్లో నాలుగు చోట్ల ప్రయోగాలు చేయడానికి ప్రభుత్వం నుండి అనుమతి రాగా సోమవారం రెండు చోట్ల పంట కోత ప్రయోగాలు చేపట్టారు. అనంతరం జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి అధ్యక్షతన క్రాప్ కటింగ్ దిగుబడిని అంచనా వేశారు. కార్యక్రమంలో ఎన్ఏఐఎస్ సిబ్బంది, ఎంపీఈఓ, ఎంఏఓ, సిబ్బంది, వీఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

**ముద్దనూరు:** ప్రస్తుత ర బీ సీజనులో శనగ పంట సాగులో పంటకోత ప్రయోగాలు చేపట్టారు. సోమవారం మండలంలోని నల్లబల్లె గ్రామంలో మండల వ్యవసాయాధికారి వెంకట కృష్ణారెడ్డి పంట కోత ప్రయోగ తీరును పరిశీలించారు. పంటకోత ప్రయోగాల ద్వారా పంటలో దిగుబడిని అంచనా వేయవచ్చని, పంట సాగులో వివిధ కొలతల్లో పంటలో వచ్చిన దిగుబడిని పరిశీలించినట్లు ఏవో తెలిపారు. మండలంలోని పలు ఎరువుల, పురుగు మందుల దుకాణాలను ఏడీఏ వెంకటసుబ్బయ్య, ఏవోలు తనిఖీ చేశారు. ప్రభుత్వం సూచించిన ధరలకే అమ్మకాలు జరపాలని వారు సూచించారు.



ముద్దనూరు: పంట కోత ప్రయోగాలను పరిశీలిస్తున్న ఏఓ వెంకట కృష్ణారెడ్డి

# జాతీయ స్థాయి పోటీలకు చదిపిరాళ్ల క్రీడాకారులు ఎంపిక

**కమలాపురం:** మండలంలోని టి.చదిపిరాళ్లకు చెందిన ఇద్దరు క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కర్నూలులో ఈ నెల 28 నుంచి జరుగుతున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో అండర్ -14 బాలికల విభాగంలో చదిపిరాళ్లకు చెందిన చాగారి ఆశ్రితారెడ్డి పాల్గొని ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచింది. అలాగే నంద్యాలలో జరుగుతున్న 66వ ఎస్‌జీఎఫ్ త్రోబాల్ స్టేట్ మీట్‌లో అదే గ్రామానికి చెందిన చల్లా విశ్వసాయి రెడ్డి పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచాడు. వీరిద్దరు త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ చంద్ర ఓబుల్ రెడ్డి తెలిపారు. కాగా విజేతలకు నిర్వాహకులు, అతిథులు అభినందించారు.



ఆశ్రితారెడ్డిని అభినందిస్తున్న పీడీ చంద్ర ఓబుల్ రెడ్డి



అతిథుల చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న చల్లా విశ్వసాయి రెడ్డి